క్లుప్తంగా

ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం, కార్మిక సంఘం నాయకులు

మెంటాడ: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులతో కలిసి కార్మిక సంఘం నాయకుడు రాకోటి రాములు శుక్రవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

రైతుల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ ఏడీ జయప్రకాష్

వంగర: గ్రామాల్లోని రైతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీ బొత్స జయప్రకాష్ తెలిపారు. స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన.. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్.ఎల్.ఎం) ద్వారా రైతులకు వివిధ రకాల యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు, గడ్డి పెంపకం, పందుల పెంపకం వంటి యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. అనంతరం మగ్గూరులో దత్తి వెంకటరావు మేకల పెంపకం యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీ అలుగోలు చిరంజీవి, పశు వైద్యాధికారి వేగిరెడ్డి రాము, ఏపీఎంలు టి.మంగమ్మ, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి

బొబ్బిలి: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలో పలు దుకాణాల వద్ద ఏర్పాటు చేస్తున్న కొత్త విద్యుత్ స్మార్ట్ మీటర్లను శుక్రవారం చూసిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల కారణంగా భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ నెల నుంచే ప్రజలపై విద్యుత్ భారం వేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించిందన్నారు. పూర్తిగా అమలులోకి రాకముందే దీనిని మనమంతా వ్యతిరేకించాలన్నారు. శనివారం స్థానిక బృందావన్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు, కరెంట్ చార్జీల పెంపు, కేంద్ర ప్రభుత్వ ఒప్పందాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

చెరువుల పరిశీలన



అవుటు చెరువును పరిశీలిస్తున్న రీజనల్ పొల్యూషన్ కంట్రోల్ అధికారిణి సరిత

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట గ్రామాల వద్ద ఉన్న నాయుడు, అవుటు సాగునీటి చెరువులను రీజనల్ పొల్యూషన్ కంట్రోల్ అధికారిణి బీవీ సరిత శుక్రవారం పరిశీలించారు.

స్థానికంగా ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం వ్యర్థాలు చెరువుల్లో కలిసి పంటలు పాడవుతున్నాయని సంకిలి సర్పంచ్ బుడుమూరు పట్టాభి, పాలకవర్గం, అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావులు ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు అధికారిణి.. ఆ రెండు చెరువుల నీటి శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. నివేదిక వచ్చిన తర్వాత విషయం వెల్లడిస్తామని ఆమె ఫిర్యాదుదారులకు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు రావడానికి 30 రోజుల సమయం పడుతుందన్నారు.

9న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బొబ్బిలి: స్థానిక కోట చెరువు గట్టు సమీపంలోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ కార్యదర్శి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. బొబ్బిలి పట్టణం సహా మండల వినియోగదారులంతా తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

- రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రత్యేక చర్యలు
- హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన
- మైనర్ల వాహనాల సీజ్ చేస్తూ ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం
- ఏడాదిలో 2008 కేసుల నమోదు

ఏడాదిలో రాజాం నియోజకవర్గంలో నమోదైన ద్విచక్ర వాహన ప్రమాదాలు

మండలం	ప్రమాదాల సంఖ్య	మరణాల సంఖ్య
రాజాం	19	06
రేగిడి	12	04
వంగర	06	04
సంతకవిటి	05	02



హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ!

రాజాం: రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహన ప్రమాదాలే ఉంటున్నాయి. ఈ దుర్ఘటనల బారినపడి మృతి చెందుతున్న వారి సంఖ్య కూడా ఇటీవల కాలంలో అధికంగా నమోదవుతుండడం చాలా దురదృష్టకరం. గతంలో కన్నా ద్విచక్ర వాహనాల వినియోగం పెరగడం, మైనర్లు ఎక్కువగా డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలపై అంతగా అవగాహన లేకపోవడం, హెల్మెట్ వినియోగించకపోవడం వంటి కారణాలే ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించిన పోలీస్ శాఖ హెల్మెట్ వినియోగంపై అన్ని మండలాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, వాహన తనిఖీలు, మైనర్‌ల డ్రైవింగ్‌ను నిరోధించడం వంటి చర్యలు చేపడుతున్నారు. పాఠశాలలు, కళాశాలల వేదికగా చైతన్యం చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేస్తున్నారు.



రేగిడిలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి(ఫైల్)

కేసుల నమోదు ఇలా..

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు రాజాం నియోజకవర్గంలో మొత్తం 2008 హెల్మెట్ లేని ప్రయాణాల కేసులు నమోదు చేశారు. వీటిలో రాజాం పట్టణం సహా మండలంలో 810 కేసులు, వంగర మండలంలో 640 కేసులు, రేగిడి మండలంలో 348 కేసులు, సంతకవిటి మండలంలో 210 కేసులు నమోదయ్యాయి.

మైనర్లే అధికం..

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిలో మైనర్లే అధికంగా కనిపిస్తున్నారు. రాజాం పట్టణంలో కళాశాలల నిమిత్తం వచ్చే విద్యార్థులు అధికంగా బైక్‌లు వినియోగిస్తున్నారు. వీరు హెల్మెట్ వినియోగించకపోవడంతో పాటు నిబంధనలు అతిక్రమించి వేగంగా డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రతీ వారంలో రెండు, మూడు పర్యాయాలు రాజాం, గుళ్లసీతారాపురం, సంకిలి, బూరాడ, శిర్లాం, వంగర, అరసాడ తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు ముమ్మరం చేసి, మైనర్ డ్రైవర్లపై దృష్టి సారిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు వారు డ్రైవింగ్ చేస్తే మొదటి తప్పుగా రూ.535 అపరాధ రుసుం, రెండో దఫా దొరికితే వాహనాలు సీజ్ చేస్తున్నామన్నారు. మరోవైపు డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిరోధించడం, హెల్మెట్ వాడకం తప్పనిసరి చేస్తుండడం, ఉల్లంఘనులకు అపరాద రుసుం విధించి, ప్రమాదాల సంఖ్య తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు.

ప్రత్యేక దృష్టిసారించాం..



ప్రస్తుతం పండగలు వస్తున్నాయి. గతంలో కన్నా ద్విచక్ర వాహన వినియోగాలు ఇప్పుడు విపరీతంగా పెరిగాయి. మైనర్లు ప్రధానంగా వాహనాలు నడపడం, హెల్మెట్‌లు వినియోగించకపోవడం వంటివి చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై చర్యలు కఠినతరం చేశాం. –హెచ్.ఉపేంద్ర, సీఐ, రాజాం రూరల్



బకాయి వేతనాలు చెల్లించాలి

గ్రీన్ అంబాసిడర్లకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పలువురు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి బాడంగి మండల పరిషత్ కార్యాలయానికి శుక్రవారం వెళ్లి, ఏవో శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. సదరు పారిశుధ్య సిబ్బందికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందని తెలిపారు. జీవో నంబరు 680 ప్రకారం ప్రతినెలా వారికి రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, మరణించిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

–బాడంగి



పొంచి ఉన్న ప్రమాదం

రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్.. క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి మధ్య ప్రధాన రోడ్డులో నెలకొన్న ఓ పెద్ద గుంత ప్రమాదకరంగా తయారైంది. రెండు అడుగుల లోతు కలిగిన ఈ గుంత కారణంగా అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బొబ్బిలి జంక్షన్ నుంచి రామభద్రపురం గ్రామం మధ్య గుండా వెళ్లే రోడ్డు కూడా పెద్ద పెద్ద గోతులతో చాలా అధ్వానంగా తయారైంది. కనీసం గోతులు అయినా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

–రామభద్రపురం



మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని రామభద్రపురం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు.. తమకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ఇప్పుడున్న మెనూ చార్జీలకు అదనంగా కేవలం 31 పైసలు కేంద్రం పెంచడం దారుణమన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ చార్జీ చెల్లించాలని, తమకు కనీసంగా రూ.10 వేల వేతనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఈవో తిరుమలప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వి.చిన్నమ్మలు, టి.సరోజిని, వి.లక్ష్మి, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

–రామభద్రపురం

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

సాక్షి ఎఫెక్ట్



కూరగాయ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి మోహనకృష్ణ

రామభద్రపురం: సస్యరక్షణ చర్యలతో కూరగాయ పంటలకు సోకే తెగుళ్లు, చీడపీడలు నివారించుకోవచ్చని మండల ఉద్యాన శాఖాధికారి పి.మోహనకృష్ణ సూచించారు. ఇటీవల ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు కూరగాయ పంటలకు తెగుళ్లు, పురుగులు పట్టి, పూర్తిగా పాడయ్యాయి. దీంతో 'కూరగాయ రైతుకు కలిసిరాని కాలం'!అనే శీర్షికతో ఈ నెల ఐదో తేదీన సాక్షి కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన ఉద్యాన శాఖాధికారి మోహనకృష్ణ, వీహెచ్‌ఏ హైమావతిలు మండలంలోని కూరగాయ పంటలను శుక్రవారం పరిశీలించారు. తుపాను వర్షాలకు కూరగాయ పంటల్లో తెగులు, పురుగు బెడద, వైరస్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పొట్టి చిక్కుడులో మొజాయిక్ తెగులు, ఆకుల మీద లేద పసుపు మచ్చలు, బాక్టీరియా తెగులును గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. చిక్కుడు పంటకు 'పెరఫెక్ట్' పురుగు మందును ఒక లీటరు నీటికి 1.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని, వైరస్ ఉధృతి ఎక్కువగా ఉంటే వారం రోజుల తర్వాత అదే మందును 0.5 ఎంఎల్ పిచికారీ చేయాలని తెలిపారు. పూత, పిందె నిలవడానికి లీటరు నీటికి మూడు గ్రాముల బోరాన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. బూస్టర్ డోసుగా ఒక ఎకరానికి పోటాషియం 12 కిలోలు, 20 కిలోల యూరియా వేయాలన్నారు. వంగలో కొమ్ము, కాయపచ్చ పురుగు నివారణకు థయోడికార్బ్ 75 శాతాన్ని ఒక లీటరు నీటికి 1 గ్రాము చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఉల్లిలో తామర పురుగు నివారణకు లీటరు నీటికి వేపనూనె 5 ఎంఎల్, ఫ్రిప్రోనిల్ 2 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేస్తే తెగులు, పురుగు బెడదలు నివారించవచ్చన్నారు. ఏవైనా సందేహాలుంటే గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు.

సర్వేలు వేగవంతం చేయాలి

వంగర: వెలుగు శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వీవోఏలు, సీసీలు సంయుక్తంగా చేపడుతున్న వివిధ రకాల సర్వేలను వేగవంతం చేయాలని రాజాం వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. మహిళా స్వయం శక్తి సంఘాల ఇన్‌కమ్ ప్రొఫైలింగ్ యాప్‌లో సర్వే చేపట్టి, ఆన్‌లైన్‌లో వివరాలను ఈ నెల 8వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. పొటెన్షియల్ లక్‌పత్ దీదీ యాప్‌లో మండలంలో గుర్తించిన 2008 మంది సభ్యుల వివరాలను అజీవక్ యాప్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో భాగంగా పైపులు, స్ప్రింక్లర్‌లను 90శాతం సబ్సిడీపై అందిస్తామన్నారు. సమావేశంలో ఏపీఎంలు టి.మంగమ్మ, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు సూచించారు. మండలంలోని లచ్చన్నవలస ప్రాథమిక పాఠశాలను వారు శుక్రవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు శుక్రవారం నిర్వహించారు. భూ సరిహద్దు, విస్తీర్ణ, మ్యుటేషన్ సమస్యలు, భూ తగాదాలపై రైతుల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటికీ పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి మళ్లీ తీసుకువస్తే సత్వరమే చర్యలు చేపడతామన్నారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం: అంతకాపల్లిలో రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న తహసీల్దారు రాజు



బొబ్బిలిరూరల్: చింతాడలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్‌డీవో రామ్మోహనరావు



బాడంగి: పూడివలస రెవెన్యూ సదస్సులో అధికారులను నిలదీస్తున్న రైతులు



రేగిడి: కొమెరలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

ప్రపంచ మేధావి, రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా కార్యక్రమంలో పాల్గొని, అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఆదర్శప్రాయుడు, సమసమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్ అని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన పాటుపడిన తీరు అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ తదితరులు



సంతకవిటి: వాల్తేరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



బొబ్బిలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: సీహెచ్‌సీ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సీఐ సతీష్ కుమార్, వైద్యాధికారి శశిభూషణరావు



వంగరలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, దళిత సంఘాల నాయకులు



రాజాం సిటీ: బొద్దాంలో అంబేడ్కర్ వర్ధంతిలో జైభీమ్ నినాదాలు చేస్తున్న సమతా సైనిక్ దళ్ సభ్యులు

డ్రోన్ల వినియోగంపై అవగాహన

బొబ్బిలిరూరల్: స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలకు డ్రోన్ల వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ మాట్లాడుతూ నమో డ్రోన్ దీదీ పథకం పేరుతో పొదుపు సంఘాల మహిళలకు డ్రోన్‌లు అందజేయడం జరుగుతోందని, వ్యవసాయంలో డ్రోన్‌ల పాత్ర కీలకంగా మారిన నేపథ్యంలో వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. సాగును సులభతరం చేసేందుకు ఈ డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు.

డిప్యూటీ ఈఓ సందర్శన



బొబ్బిలిరూరల్: రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి ప్రభుత్వ పాఠశాలను డిప్యూటీ ఈవో మోహనరావు శుక్రవారం సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై శనివారం నిర్వహించాల్సిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌పై చర్చించారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులంతా సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు విద్యాబోధన, విద్యాసామర్థ్యాల పెంపుపై చర్చించడం జరుగుతుందన్నారు.

రాజాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో యాగాటి దుర్గారావు కోరారు. మండలంలోని మెంతిపేట, మల్లయ్యపేట, పెనుబాక తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి, విద్యార్థులు తయారు చేసిన ఇన్విటేషన్ గ్రీటింగ్స్ చూసి, అభినందించారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ ఈవో మోహనరావు శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయ సిబ్బంది పనితీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, పాఠశాల రికార్డులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. పిల్లల చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.